తెలుగు దినపత్రిక
ప్రభాత jayabheridaily.com
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
17-05-2024
శుక్రవారం
మల్కాజిగిరి
సంపుటి : 01 | సంచిక : 269 | పేజీలు : 8 | వెల : 4

జయభేరి దినపత్రిక
జయభేరి చానల్లో
నికార్సైన జర్నలిస్టులుగా
నిలబడాలను
కుంటున్నారా..
ఆసక్తి కలిగిన యువతీ
యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి
ప్రాధాన్యత
jayabherinews@gmail.com
jayabheridaily.com
+91 9391 544 889



- హైదరాబాద్‌లో కుండపోత వర్షం
- ఒక్కసారిగా మారిన వాతావరణం
- కరీంనగర్ జిల్లాలో గాలివాన బీభత్సం పిడుగుపాటుతో ఇద్దరు మృతి
- మరో ఐదురోజులు వర్షాలు..
- సీఎం రేంత్ ఆదేశాలు
- రుతు పవనాలు వచ్చేస్తున్నాయ్...

# తెలంగాణలో భారీ వర్షం

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. గురువారం మధ్యాహ్నం తర్వాత హైదరాబాద్ తో పాటు చాలా జిల్లాల్లో వర్షం కురుసింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గాలివాన బీభత్సం సృష్టించింది. అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గాలివాన భీభత్సం సృష్టించింది. ఉరుములు మెరుపులతో కూడిన వానతో పలుచోట్ల పిడుగులు పడ్డాయి. పిడుగు పాటుకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇద్దరు మృతి చెందారు. మరో నలుగురు అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలయ్యారు.
కరీంనగర్ జిల్లాలో రెండు పశువులు మృతి చెందాయి. వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లిలో వ్యవసాయ పనులకు వెళ్ళిన వారిపై పిడుగుపడడంతో కంబాల శ్రీనివాస్ (32) అక్కడికక్కడే మృతి చెందారు. మరో నలుగురు కొమురమ్మ, ఎల్లవ్వ, దేవయ్య, శ్రీనివాస్ అస్వస్థతకు గురికావడంతో వెంటనే స్థానికులు వేములవాడ ఆసుపత్రికి తరలించారు. వ్యవసాయ పొలం వద్ద పనికి వెళ్ళిన ఐదుగురు

...మిగతాది 2 లో

# ఫిర్ ఏక్ బార్..
# 400 పార్



2 లో

- ఎక్కడికెళ్లినా ఒకటే మాట వినిపిస్తోంది..
- మోడీ గ్యారెంటీపై ప్రజలకు నమ్మకం ఉంది.. అందుకు ఉదాహరణ సీఏఏ చట్టమే
- విపక్ష కూటమి ఓటు బ్యాంక్ రాజకీయం చేస్తోంది
- 70ఏళ్లుగా హిందువులు, ముస్లింలు అంటూ విభజించి రాజకీయం చేశారు
- విపక్షాలపై ఫైర్ అయిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడి

**జయభేరి, అజాంఘర్, మే 16:**

పేదల అభివృద్ధి కోసం రాత్రి పగలు కష్టపడుతున్నానని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. మీ బాధలను ఒక్కొకటిగా తొలగిస్తున్నామని చెప్పారు. లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉత్తర ప్రదేశ్ లో ప్రధాని మోడీ పర్యటిస్తున్నారు. అజాంఘర్ లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ.. 'ఎక్కడికెళ్లినా ఒకటే మాట వినిపిస్తోంది.. అదే ఫిర్ ఏక్ బార్.. 400 పార్' అని చెప్పారు. దేశ ప్రజలంతా మోడీనే మళ్లీ ప్రధాని అంటున్నారని ఆయన చెప్పారు. మోడీ గ్యారెంటీపై ప్రజలకు నమ్మకం ఉందని.. అందుకు, సీఏఏ చట్టమే ఉదాహరణ అని ప్రధాని చెప్పారు. సీఏఏ కింద భారత్ పౌరసత్వం ఇవ్వడం ప్రారంభమైందన్నారు. దేశంలో వీరంతా చాలా ఏళ్లుగా శరణార్థులుగా ఉన్నారని చెప్పారు. మోడీ వెళ్తే సీఏఏ కూడా వెళ్తుందని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని..



# తెలంగాణలో భూముల మార్కెట్ విలువ సవరణ..!

రాష్ట్ర ఆదాయ వనరులపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. ఆదాయం పెంచడానికి అధికారులు పక్కా ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర వార్షిక లక్ష్యాలకు అనుగుణంగా ఆదాయం పెంచడానికి అధికారులు పక్కా ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అందుకోసం శాఖల మధ్య సమన్వయం ఉండాలని, పన్నుల ఎగవేత విషయంలో ఎలాంటి లోసుగులు లేకుండా కఠిన చర్యలు చేపట్టాలని హెచ్చరించారు.

2 లో

# బీఆర్ఎస్ పార్టీలో మరో చిచ్చు మొదలైందా?

- 130 మందికి ఆహ్వానం30 మంది హాజరు

**జయభేరి, హైదరాబాద్, మే 16:**

బీఆర్ఎస్ పార్టీలో మరో చిచ్చు మొదలైందా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికలు పూర్తి కావడంతో ఆ పార్టీ ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికలపై ఫోకస్ చేసింది. ఎలాగైనా ఎమ్మెల్సీ సీటును గెలుచుకోవాలని ప్లాన్ చేసింది. అందుకు తగ్గట్టుగా వ్యూహాలను సిద్ధం చేసింది కారు పార్టీ. హైదరాబాద్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక రివ్యూ సమావేశానికి రావాలని ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాలు, నియోజకవర్గాల ముఖ్య నేతలకు పిలుపు ఇచ్చారు కేటీఆర్. విచిత్రం ఏంటంటే 130 మందిని రమ్మంటే.. కేవలం 30 మంది రావడంతో కాసింత అసహనం

...మిగతాది 2 లో






# 160 ప్లస్ 22
## ఐ ప్యాక్ టీంతో జగన్

**జయభేరి, విజయవాడ, మే 16:**

మళ్లీ అధికారంలోకి రాబోతున్నామని వైసీపీ అధినేత, సీఎం జగన్ ధీమా వ్యక్తం చేశారు. విజయవాడలోని ఐ ప్యాక్ ఆఫీసుకు జగన్ వెళ్లారు. పార్టీ కోసం పని చేసిన వారికి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మాట్లారు. వచ్చే ప్రభుత్వంలో ఈ ఐదేళ్ల కంటే ఎక్కువగా ప్రజలకు మేలు చేస్తామన్నారు. రానున్న రోజుల్లో ఈ ప్రయాణం ఇలానే కొనసాగుతుందని అన్నారు. జూన్ 4న ఫలితాలు చూసి దేశం షాక్ అవబోతోందని ప్రకటించారు. 22 ఎంపీ సీట్లు గెలవబోతున్నామని.. ప్రశాంత్ కిషోర్ ఆలోచించలేనన్ని సీట్లు రాబోతున్నాయని జోస్యం చెప్పారు.ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ వైసీపీ కోసం స్ట్రాటజిస్టుగా పని చేసింది. ప్రశాంత్ కిషోర్ ఐ ప్యాక్ లో ఉన్నప్పుడు ఒప్పందం కుదుర్చుకున్నారు. 2014 ఎన్నికల్లో పరాజయం పాలైన తర్వాత పీకేతో ఒప్పందం చేసుకున్నారు. 2019 ఎన్నికల్లో ప్రశాంత్ కిషోర్ అంతా తానై వ్యవహరించారు. ఆ తర్వాత ఐ ప్యాక్ తరపున తమిళనాడు, బెంగాల్ లో డీఎంకే, టీఎంసీలకు పని చేశారు. అక్కడ కూడా ఆయన పని చేసిన పార్టీలకు విజయాలు సాధించి పెట్టారు. తర్వాత ఐ ప్యాక్ నుంచి బయటకు వచ్చేశారు. సొంత సంస్థను పెట్టుకుని బీహార్ లో పాదయాత్ర చేశారు. కానీ ఆ సంస్థను రాజకీయ పార్టీగా తీర్చిదిద్దలేకపోయారు. ఈ ఎన్నికల్లో పోటీ చేయలేదు. అయితే దేశంలో

...మిగతాది 2 లో



# కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరులో ఎటువంటి మినహాయింపులేవు

- మా తీర్పుపై విమర్శనాత్మక విశ్లేషణను ఆహ్వానిస్తాము
- మధ్యంతర బెయిల్‌పై సుప్రీం స్పష్టీకరణ

**జయభేరి, న్యూఢిల్లీ మే 16:**

సార్వత్రిక ఎన్నికల కోసం ప్రచారం చేసేందుకు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంలో తాము ఎటువంటి మినహాయింపులు ఇవ్వలేదని సుప్రీంకోర్టు గురువారం స్పష్టం చేసింది. తీర్పుకు సంబంధించి విమర్శనాత్మక విశ్లేషణను

...మిగతాది 2 లో



# ఎమ్మెల్సీ కవిత పిటిషన్.. ఈ నెల 24 కు వాయిదా

**జయభేరి, న్యూఢిల్లీ, మే 16:**

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో తనను సీబీఐ అరెస్ట్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఎమ్మెల్సీ కవిత ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ రోజు కవిత వేసిన పిటిషన్ ను విచారించిన ధర్మాసనం కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐకి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను మే 24కు వాయిదా వేసింది.

▶▶ మొదటిపేజీ తరువాయి

## భూముల మార్కెట్ విలువ సవరణ..!

రాష్ట్రానికి ప్రధానంగా ఆదాయం తెచ్చిపెట్టే వాణిజ్య పన్నులు, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, ఎక్సైజ్, మైనింగ్ విభాగాల అధికారులతో గురువారం సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. బడ్జెట్ లో నిర్దేశించిన మేరకు రాబడి సాధించడానికి నెలవారి టార్గెట్ తో పనిచేయాలన్నారు. గత ఏడాది సమకూరిన ఆదాయంపై అసంతృప్తిని వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి... జీఎస్టీ ఎగవేత లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అంచనా మేరకు జీఎస్టీ సాధించడంలో క్షేత్రస్థాయి పరిశీలనలు, ఆడిటింగ్‌లను పకడ్బంధీగా జరపాలన్నారు. జీఎస్టీ ఎగవేతదారులు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని చెప్పారు. అక్రమ మద్యం రవాణాను అరికట్టడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. “గత ప్రభుత్వం 2021లో భూముల విలువను, రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచింది. ఇప్పటికీ చాలాచోట్ల భూముల మార్కెట్ విలువకు, క్రయ విక్రయ ధరలకు భారీ తేడా ఉంది. నిబంధనల ప్రకారం ఏడాదికో సారి భూముల మార్కెట్ విలువను సవరించాల్సి ఉంటుంది. ఆ క్రమంలో ధరల సవరణకు చర్యలు చేపట్టాలి. రాష్ట్ర రాబడి పెంపుతో పాటు స్థిరాస్థి, నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించేందుకు వీలుగా భూముల మార్కెట్ ధరల సవరణ జరగాలి. స్టాంప్ డ్యూటీ తగ్గించడమా లేక పెంచడమా అన్న విషయంలో ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలి” అని ముఖ్యమంత్రి ఆదేశించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉద్యోగుల కొరత లేకుండా సర్దుబాటు చేయాలన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. సామాన్యులకు ఇసుక కొరత రాకుండా అక్రమ రవాణాను, లీకేజీలను అరికట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

## తెలంగాణలో భారీ వర్షం

వర్షంతో చెట్టు దగ్గర నిల్చోగా పిడుగు పాటుకు గురయ్యారు. అటు తంగళ్ళపల్లి మండలం ఇందిరానగర్ పిడుగుపాటుకు భరత్ నగర్ కు చెందిన రైతు రుద్రారపు చంద్రయ్య(50) మృతి చెందారు. పొలం పనులకై వెళ్ళగా పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పర్లపల్లి లో పిడుగు పాటుకు రెండు ఆవు దూడలు మృతి చెందాయి. పలు చోట్ల వర్షానికి కల్లాల్లో దాన్యం తడిసి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అల్పపీడన ద్రోణి ప్రభావంతో మరో ఐదు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. చెట్ల క్రింద ఉండవద్దని వ్యవసాయ పొలాలకు వెళ్ళే వారు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. దాన్యం కొనుగోలు కేంద్రాల్లో దాన్యం తడవకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బలమైన ఈదురుగాలుల వీస్తాయని పేర్కొంది. మే 22వ తేదీ వరకు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని తాజాగా విడుదల చేసిన బులెటిన్ లో పేర్కొంది. శుక్రవారం(మే 17) భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబనగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాలలో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి. వర్షం వల్ల సమస్యలు తలెత్తితే, సహాయం కోసం డీఆర్ఎఫ్ నెంబర్లు 04021111111, 9000113667 సంప్రదించాలని అధికారులు సూచించారు.

**సీఎం రేంత్ ఆదేశాలు**

హైదరాబాద్‌తో పాటు వర్షం పడుతున్న ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. సచివాలయం నుంచి అన్ని విభాగాల అధికారులతో సీఎం మాట్లాడారు. ప్రజలకు ఎక్కడా ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**రుతు పవనాలు వచ్చేస్తున్నాయ్...**

భారత వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. మే 19న అండమాన్ తీరాన్ని నైరుతి రుతుపవనాలు తాకే అవకాశం ఉందని అంచనా వేసింది. కేరళతో పాటు ఆంధ్రప్రదేశ్ లోకి ప్రవేశించే సమయంపై కీలక ప్రకటన చేసింది. మే 19న అండమాన్ తీరాన్ని నైరుతి రుతుపవనాలు తాకే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. మే నెలాఖరులో కేరళను నైరుతి రుతుపవనాలు తాకే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ గురువారం తెలిపింది. కేరళలోకి ప్రవేశించిన తర్వాత ఏపీలోకి రుతుపవనాల ప్రవేశం ఉంటుందని పేర్కొంది. ఐఎండీ అంచనాల ప్రకారం... జూన్ తొలి వారంలో ఆంధ్రప్రదేశ్ లోకి నైరుతి రుతుపవనాలు ఎంట్రీ ఇచ్చే అవకాశం ఉంది.

## కేజ్రీవాల్‌కు బెయిల్

ఆహ్వానిస్తామని కూడా సుప్రీంకోర్టు తెలిపింది. ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్‌కు సంబంధించి కొందరు చేసిన ప్రకటనలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), కేజ్రీవాల్ తరపు న్యాయవాది వాద ప్రతివాదనలు చేయడానికి ప్రయత్నించగా వాటిని పరిగణనలోకి తీసుకోవడానికి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం నిరాకరించింది. మా తీర్పుపై విమర్శనాత్మక విశ్లేషణను ఆహ్వానిస్తాము అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఇడి తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఎన్నికల ప్రచారం సందర్భంగా కేజ్రీవాల్ చేస్తున్న వ్యాఖ్యలపై అభ్యంతరం తెలిపారు. ఆప్‌కు ఓటేస్తే తాను జూన్ 2న మళ్లీ తీహార్ జైలుకు వెళ్లనవసరం లేదని కేజ్రీవాల్ చేస్తున్న ప్రసగాలను ఆయన ప్రస్తావించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ& అది ఆయన (కేజ్రీవాల్) ఊహ..దానిపై మేమేమీ చెప్పలేము అని ధర్మాసనం తెలిపింది. కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ ఇవ్వడం అసాధారణమంటూ ఒక సీనియర్ కేంద్ర మంత్రి (అమిత్ షా) చేసిన వ్యాఖ్యలను కేజ్రీవాల్ తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ ప్రస్తావించారు. తన అరెస్టుపై కేజ్రీవాల్ దాఖలు చేసిన ప్రధాన పిటిషన్ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.

## ఫిర్ ఏక్ బార్.. 400 పార్

సీఏఏను ఎవరూ ఆపలేరన్నారు. విపక్ష కూటమి ఓటు బ్యాంక్ రాజకీయం చేస్తోందని మోడీ విమర్శించారు. ఇండియా కూటమి పేదల రిజర్వేషన్లను ముస్లింలకు కేటాయిస్తామంటున్నారని.. మైనార్టీలకు బడ్జెట్ లో 50శాతం ఖర్చు చేస్తామంటున్నారని మండిపడ్డారు. 70ఏళ్లుగా హిందువులు, ముస్లింలు అంటూ విభజించి రాజకీయం చేశారని విపక్షాలపై ఫైర్ అయ్యారు. దేశమంతా ఇప్పుడు ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవంపై కూడా ఇండియా కూటమి విమర్శలు చేసిందని చెప్పారు. ప్రజలంతా బీజేపీ, ఎన్డీఏ కూటమితోనే ఉన్నారని.. మూడోసారి బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ప్రధాని మోడీ చెప్పారు.

## 160 ప్లస్ 22

సుప్రసిద్ధమైన ఎన్నికల స్ట్రాటజిస్టుగా ఉన్న ఆయన ఇటీవల చాలా మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు ఇచ్చారు. ఆ సమయంలో ఏపీలో వైసీపీ చాలా భారీగా ఓడిపోతుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ వస్తున్నారు. ఇలా చెప్పడంపై వైసీపీ ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వస్తోంది. ఐ ప్యాక్ మీటింగ్ లోనూ జగన్ ఇదే విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రశాంత్ కిషోర్ ఊహించలేనన్ని సీట్లు వస్తాయని చెప్పుకొచ్చారు. ఏడాదిన్నర కిందట.. జగన్ ను ఢిల్లీలో కలిసినప్పుడు కూడా తాను ఆయన ఓడిపోతున్నట్లుగా చెప్పానని పీకే ఇంతకు ముందే ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ప్రస్తుతం వైసీపీకి పని చేసిన ఐ ప్యాక్ టీమును రిషిరాజ్ సింగ్ అనే స్ట్రాటజిస్ట్ లీడ్ చేశాడు. వారితో కూడా ఆ ప్యాక్ కాంట్రాక్ట్ ముగిసిందని చెబుతున్నారు. మళ్లీ ప్రభుత్వం ఏర్పడితే ఐ ప్యాక్ తో కాంట్రాక్ట్ ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని..లేకపోతే ఇక ఐప్యాక్ సేవలు కొనసాగించరని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. జగన్ తో మీటింగ్ తర్వాత ఐ ప్యాక్ సభ్యులంతా.. సొంత ప్రాంతాలకు వెళ్లిపోతారని వైసీపీ వర్గాలు మీడియాకు చెబుతున్నాయి.


## మరో చిచ్చు మొదలైందా?

వ్యక్తం చేశారట ఆ పార్టీ ఉపాధ్యక్షుడు. ఎందుకిలా జరిగిందని కీలక నేతలతో అన్నట్లు సమాచారం. ఇందుకు కారణాలు లేకపోలేదు. సమావేశానికి రాని వారిలో వరంగల్ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, వినయ్ భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు వంటి నేతలు ఉన్నారు. ఉపఎన్నిక అభ్యర్థి రాకేష్‌రెడ్డిని ఆయా నేతలు గట్టిగా వ్యతిరేకించినట్టు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి సన్నిహితుడిగా ఉన్న రాకేష్‌రెడ్డి ఏకపక్షంగా ఎంపిక చేయడమే మాజీల అసంతృప్తికి కారణమని తెలుస్తోంది బీఆర్ఎస్ భవన్‌లో ఎప్పుడు మీటింగ్ పెట్టినా భారీగా నేతలు వచ్చేశారు. అన్నట్టు ఆ మధ్య బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కూడా లోక్‌సభ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అవుతుందని ఓపెన్‌గా చెప్పేశారు. కొద్దిరోజుల్లో జీహెచ్ఎంసీ ఎన్నికలు కూడా రానున్నాయి. మారుతున్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఇంకెంతమంది కారు దిగుతారో అన్న చర్చ అప్పుడే బీఆర్ఎస్ నేతల్లో మొదలైంది. రానున్న రోజుల్లో ఆ పార్టీలో ఇంకా ఏం జరుగుతుందో చూడాలి.

# సంక్షోభమా తప్పదా..?

**తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలతో మొదలైన పొలిటికల్ వేడి... ఎంపీ ఎన్నికలు ముగిసినా చల్లారట్లేదు. పదేళ్ల తర్వాత రాష్ట్రంలో అధికారం దక్కించుకున్న కాంగ్రెస్ ఓవైపు... సీట్లు, ఓట్లు పెంచుకున్న బీజేపీ మరోవైపు... అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్య ఓటమి చవిచూసిన బీఆర్ఎస్ ఇంకోవైపు... ఈ మూడు పక్షాలు హోరాహోరీగా తలపడటంతో పార్లమెంట్ ఫలితాలు ఉత్కంఠ రేపుతున్నాయి. ప్రధాన పార్టీలు నువ్వానేనా? అన్నట్టుగా తలపడిన ఈ ఎన్నికల్లో... జనం ఎటువైపు నిలిచారన్నదే తెలియాల్సి ఉంది. తమ పాలనకు రెఫరెండమన్న కాంగ్రెస్‌ను ఆదరించారా? బీజేపీకి మరింత బలాన్నిచ్చారా? గ్యారేజీకి పోయిన కారును సపోర్ట్ చేశారా? అన్నదే ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. రిజల్ట్ ఎలా ఉన్నా, నేతల మాటలు మాత్రం తెలంగాణ రాజకీయాల్లో కొత్తమంటలు రాజేస్తున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డికి ఆగస్టు సంక్షోభం ఎదుర్కోక తప్పదంటూ బీజేపీ ఎంపీ లక్ష్మణ్ చేసిన కామెంట్స్.. దుమారం రేపుతున్నాయి.**

**✍ జయభేరి, హైదరాబాద్, మే 16:**




బీజేపీ నేతల వ్యాఖ్యలకు అదేస్థాయిలో కౌంటర్ ఇస్తున్న కాంగ్రెస్‌నాయకులు... బీజేపీ, బీఆర్ఎస్ నుంచి చేరికలతో రాబోయే రోజుల్లో తమ అసెంబ్లీబలం 90కి పెరుగుతుందంటున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారంటూ ఇప్పటికే పలుమార్లు పొలిటికల్ బాంబులు పేల్చిన బీఆర్ఎస్ నేతలు.. జాతీయ పార్టీలకు చెమటలు ఈ ఎన్నికల్లో పట్టించామంటోంది. రాష్ట్రంలో ఏం జరుగుతుందో జూన్4 తర్వాత చూడాలంటున్నారు కేటీఆర్. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇప్పుడిక చివరి రోజులేనా? కాంగ్రెస్ ప్రభుత్వాన్ని త్వరలో భారతీయ జనతా పార్టీ కూల్చేయబోతోందా? తెలంగాణ రాష్ట్రంలో ఆగస్టు సంక్షోభం తప్పదా? రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి బిజెపి డెడ్ లైన్ ఫిక్స్ చేసిందా? అంటే ఈ ప్రశ్నలకు బిజెపి సీనియర్ నాయకులు వరుసగా చేస్తున్న వ్యాఖ్యలు బలం చేకూర్చే విధంగా ఉన్నాయి.. ఆ మధ్య తెలంగాణ రాష్ట్రంలో ఏక్‌నాథ్ షిండే లు పుట్టుకొస్తారని బిజెపి రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. మరోసారి ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.. రాష్ట్రంలో ఆగస్టు తరహా సంక్షోభం వస్తుందని ఆయన అన్న మాటలు చర్చకు దారితీస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చింది. వాటిని సకాలంలో అమలు చేయకపోతే ఇబ్బందులు తప్పవు. ఇచ్చిన హామీలను ఆగస్టులో నెరవేర్చాలి. లేకుంటే ఆగస్టు తరహా సంక్షోభం ఖాయమని” లక్ష్మణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతో తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కమలం పార్టీ నాయకులు కూల్చేస్తారని ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీకి డబుల్ డిజిట్ స్థానాలు కనుక వస్తే.. కచ్చితంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొడతారనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఇటీవల భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు పై వాటిని బలపరుస్తున్నాయి. పెద్దగా వివాదాల జోలికి పోనీ లక్ష్మణ్ లాంటి నాయకుడు కూడా.. సంచలన వ్యాఖ్యలు చేయడం ఆసక్తికరంగా మారింది. బిజెపి పెద్దల ఆదేశాలు లేకుండా ఆయన అలాంటి వ్యాఖ్యలు చేయరని, కచ్చితంగా తెలంగాణలో బిజెపి పెద్దలు గట్టి ప్లాన్ చేశారనే చర్చ నడుస్తోంది. ఇక ఇటీవల ప్రధానమంత్రి రెండుసార్లు తెలంగాణకు వచ్చినప్పుడు ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి స్వాగతం పలికారు. అధికారిక కార్యక్రమంలో విమర్శల జోలికి పోకుండా తెలంగాణకు ఇవ్వాల్సిన నిధులను మంజూరు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కోరారు.

అంతేకాదు ఆ సందర్భంలో ఆయనను బడే భాయ్ అని సంబోధించారు. దానికి మోడీ కూడా సమ్మతం అన్నట్టుగా ఓకే చెప్పారు. ఆ మధ్య ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కొంతకాలానికి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలిశారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తో భేటీ అయ్యారు.. రాష్ట్రానికి రావలసిన నిధులు, వివిధ ఉద్యోగుల కేటాయింపుపై చర్చించారు. రేవంత్ కలిసిన వెంటనే హోంశాఖ మంత్రి సివిల్ సర్వెంట్లు, ఐపీఎస్ ఆఫీసర్లను కేటాయించారు. అయితే ఇటీవల ఎన్నికల సందర్భంగా అటు రేవంత్ రెడ్డి.. ఇటు నరేంద్ర మోడీ పరస్పరం విమర్శలు చేసుకున్నారు. అమిత్ షా కూడా తీవ్ర స్థాయిలోనే ఆరోపణలు చేశారు. అయితే ఆ మధ్య రేవంత్ రెడ్డి అమిత్ షా డీప్ ఫేక్ వీడియోను ట్విట్టర్ ఎక్స్ లో పోస్ట్ చేశారని ఆరోపిస్తూ.. కేంద్ర హోంశాఖ తాఖీదులు పంపించింది.

దీనికి రేవంత్ కూడా దీటుగానే బదులిచ్చారు. అయితే అది రెండు పార్టీల మధ్య దూరాన్ని పెంచిందని.. అదే ప్రస్తుత పరిస్థితులకు కారణమైందని వార్తలు వినిపిస్తున్నాయి. ఇక ఇటీవల పలుమార్లు విలేకరుల సమావేశంలో ప్రభుత్వాన్ని పడగొడతారు అనే ప్రశ్న ఎదురైనప్పుడు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనదైన శైలిలో స్పందించారు. ప్రభుత్వాన్ని పడగొడితే.. ఆ తర్వాత తాను ఏం చేస్తానో స్పష్టం చేశారు. అలాంటి పరిస్థితుల్లో తాను ఇంకో మార్గాన్ని ఎంచుకుంటానని రేవంత్ స్పష్టం చేశారు. ఇక ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ మీద గెలిచిన వారే కాకుండా.. భారత రాష్ట్ర సమితిలో గెలిచిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్ల వెంకటరావు వంటి వారు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇంకా చాలామంది క్యూలైన్లో ఉన్నారని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు.. ఒకవేళ భారతీయ జనతా పార్టీ మహారాష్ట్ర తరహా ప్రయోగాన్ని తెలంగాణపై చేస్తే.. అది అంతిమంగా బిజెపికి నష్టం చేకూర్చుతుందని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు.. ప్రజాస్వామ్యుతంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని పడగొడితే.. అది కేంద్రంలోని బిజెపి పెద్దలకు మాయని మచ్చగా మిగులుతుందని చెబుతున్నారు.

## మారిపోయిన వాతావరణం
# తడిసి ముద్దైన వరిధాన్యం

**✍ జయభేరి, హైదరాబాద్, మే 16:**



వరిధాన్యం కొనుగోళ్లలో జాప్యం సాగుతుంది. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో వరిధాన్యం తడిసి ముద్దైంది. అంతేకాకుండా తేమ శాతం కూడా పెరిగింది. అయినప్పటికీ ధాన్యం కొనుగోళ్లులో జాప్యం చేస్తున్నారు అధికారులు. దీంతో అన్నదాతలు రోడ్డెక్కుతున్నారు. తేమ శాతంతో సంబంధం లేకుండా.. వరిధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అకాల వర్షాలు కురిశాయి. దీంతో ఐకెపి కేంద్రాల వద్ద వరిధాన్యం తడిసి ముద్దైంది. ఇప్పటికీ కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. అంతేకాకుండా తేమ శాతం పెరిగిపోయింది. దీంతో తేమ శాతం ఆధారంగానే ధాన్యాన్ని కొనుగోళ్లు చేస్తున్నారు. అయితే.. తడిసిన వరిధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోనరావు పేట మండలం మల్కాపేట గ్రామంలో రైతులు ఆందోళన చేశారు. తడిసిన పరిధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. 20 రోజుల క్రితం ధాన్యాన్ని తీసుకొచ్చినా కొనుగోలు చేయడం లేదని రైతులు రోడ్కెక్కారు. అదే విధంగా పరిధాన్యం తడిసిపోవడంతో తేమ శాతాన్ని పరిగణలోకి తీసుకొని కొనుగోలు చేస్తున్నారు. ఇంకా 20 శాతం వరకు కొనుగోలు చేయలేదు. ఇప్పుడు నాతవరణం కూడా మారిపోయింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో పది రోజుల్లో నైరుతి రుతుపవనాలు రానున్నాయి. ఖరీఫ్ సీజన్ కూడా ఆరంభంకానుంది. వెంటనే.. పరిధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కొన్ని చోట్ల వరిధాన్యం కొనుగోలు చేసినా.. సకాలంలో డబ్బులు రావడం లేదు. ఈ నాలుగైదు రోజుల్లో వరిధాన్యం పూర్తిగా కొనుగోలు చేయాలని కోరుతున్నారు. అధికారులు మాత్రం ఎలాంటి ఆందోళన చెందవద్దని రైతులకు సూచిస్తున్నారు. పూర్తి స్థాయిలో పరిధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇస్తున్నారు. అయితే ప్రభుత్వ తీరుపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. సకాలంలో వరి ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతున్నారు. అకాల వర్షాల కారణంగా వరిధాన్యం తడిసిపోయిందని రైతులు చెబుతున్నారు.

తేను శాతం పేరుతో సరిగా కొనుగోలు చేయడం లేదని అంటున్నారు. వెంటనే పరిధాన్యాన్ని కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మార్కెట్ యార్డులో ధాన్యం కుప్పలపై కవర్లు కప్పి ఉంచినప్పటికీ భారీ వర్షం ధాటికి పలువురు రైతుల ధాన్యం కొట్టుకుపోవడంతో కాపాడుకునేందుకు రైతులు వర్షంలోనే అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. వారసంతలో చిరువ్యాపారులు వాన ధాటికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కుభీరు మండలంలోని సిర్పెల్లి తండా, గొడిసెర్చ్, తదితర గ్రామాల్లో ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన వర్షం కురిసింది. కోసి ఆరబెట్టిన మొక్కజొన్న, నువ్వు పంటలు తడిసి ముద్దయ్యాయి. సిర్పెల్లి తండాలో విద్యుత్తు ట్రాన్స్ఫర్మర్ గద్దె పై నుంచి పడిపోయింది పలుచోట్ల స్తంభాలు వంగిపోయి విద్యుత్తు సరఫ రాకు అంతరాయం ఏర్పడింది.

# రైతుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ ధర్నా

- అన్నదాతలను కాంగ్రెస్ సర్కార్ దగా చేసింది - మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి
- రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుంది

జయభేరి, మే 16:



రైతుల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, వారి జీవితాలతో రేవంత్ సర్కార్ చెలగాటమాడుతుందని, రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయకుండ ఇబ్బందులకు గురి చేస్తోందని మాజి మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆరోపించారు. గురువారం శామీర్ పేట్ లో మాజి సిఎం కేసిఆర్ బిఆర్ఎస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు వ్యవసాయ సహకార సంఘాల వద్ద రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. దాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారని, కొనుగోలు చేసిన దాన్యానికి రైతుల ఖాతాల్లో డబ్బులు వేయడం లేదని మండి పడ్డారు. రైతులు పండించిన పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి రైతులను మోసం చేసిందన్నారు. రైతుభరోసా, పంట నష్టపరిహారం చెల్లిస్తామని మాయమాటలు చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కరువు తాండవిస్తుందని, కరెంట్ కోతలు, సాగునీరు, తాగునీరు లేక ప్రజలు అల్లాడిపోతున్నారని ఆవేదన చెందారు. దేవుళ్లపైన ఒట్టువేసి ఆగష్టులో రైతు రుణమాఫీ చేస్తానని చెప్పిన సిఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ మెనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారంటీలు కూడ ఒట్టేసి ఎప్పుడు అమలుపరుస్తాడో చెప్పాలని డిమాండ్ చేశారు. సిఎం కేసిఆర్ అధికారంలో ఉన్నప్పుడు చెరువులు నీటితో కళకళలాడుతుండేవని సాగునీటికి, తాగునీటికి, మత్స్యకారులు చేపల పెంపకానికి డోకా ఉండేది కాదని గుర్తు చేశారు. కాళేశ్వరంలో మూడు పిల్లర్లు కుంగితే పెద్ద రాద్ధాంతం చేస్తున్నారని పక్క నుంచి నీటి విడుదల చేయడం చేతకావడం లేదని, కేసిఆర్ను బద్నాం చేయడానికి కాళేశ్వరం ప్రాజెక్ట్ను బాగుచేయడం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల్లోనే కరువు వచ్చిందని ఎద్దేవ చేశారు. మహిళలకు రూ.2500, ఎకరానికి రూ.15 వేలు రైతుభరోసా, కల్యాణలక్ష్మి తులం బంగారం, రైతులకు బోనస్ ఎప్పుడు ఇస్తారని మీరు చెప్పిన హామీలను మాత్రమే అమలు చేయమని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాణ పోరాటాలు చేస్తుందని హామీలన్ని అమలయ్యేదాక నిరసనలు, ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో జడ్పిటిసి అనితలాలయ్య, ఎంపీపీ ఎల్లు బాయి బాబు, జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య,తాళ్ల జగదీష్ గౌడ్,వంగ వెంకట్ రెడ్డి,శ్రీకాంత్ రెడ్డి,మాజీ సర్పంచులు,ఎంపీటీసీలు,కార్యకర్తలు తదితరులుపాల్గొన్నారు.





## రైతులు పండించిన వరి ధాన్యంను వెంటనే కొనాలి

జయభేరి, దేవరకొండ :

రైతులు పండించిన వరి ధాన్యంను వెంటనే కొనాలని, వడ్లకు రూ.500 ల బోనస్ ఇవ్వాలని అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం దేవరకొండ పట్టణములో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపుమేరకు నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా మాజీ శాసన సభ్యులు రవీంద్ర కుమార్ మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికలు ముగిసిన వెంటనే వరి ధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ చెల్లిస్తానని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు సన్న వడ్ల కు మాత్రమే బోనస్ ఇస్తామనడం రాష్ట్ర రైతాంగాన్ని మరోసారి వంచించడం, మోసం చేయడం, దగా చేయడమే అని ఆయన అన్నారు.రాష్ట్రంలో 90 శాతం రైతులు దొడ్డు వడ్లనే పండిస్తారు. ఈ విషయం తెలిసి కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇట్లా ఎట్లా ప్రకటిస్తది అని ఆయన ప్రశ్నించారు. సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం ద్వారా తెలంగాణ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి వంచించింది అని తెలిపారు.ఇప్పటికీ కొనుగోలు కేంద్రాల్లో వడ్లను కొనడానికి నిర్లక్ష్యం వహిస్తూ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఏడిపిస్తూ గోస పెడుతుంది అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ రెగటి మల్లికార్జున్ రెడ్డి, ఎంపీపీ మాధవరం సునీతజనార్దన్ రావు, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్, మండల పార్టీ అధ్యక్షులు దొంతం చంద్రశేఖర్ రెడ్డి, వేలుగురి వల్లపు రెడ్డి, రమావత్ దస్రు నాయక్, లోకసాని తిరుపతయ్య, గాజుల ఆంజనేయులు, నట్వ గిరిధర్, కేసని లింగా రెడ్డి, బొయపల్లి శ్రీనివాస్ గౌడ్, ముక్కమల్ల బాల్లయ్య, నీల రవికుమార్, వేముల రాజు, బొడ్డుపల్లి కృష్ణ, రమావత్ రమేష్, కేతవత్ శంకర్,జర్పుల లోక్య నాయక్, రమావత్ తులిసిరము, వింజమూరి రవి, దండేకర్ ప్రసాద్, పొట్ట మదు, నల్ల గాజు సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

## బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి

- కేశవరంలో బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన వేంకటేశ్వర స్వామి ఆలయం

జయభేరి, మే 16:

మేడ్చల్ జిల్లా మూడుచింతల పల్లి మండలం కేశవరం గ్రామం లోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈనెల 18 నుంచి 22 వరకు ఆలయంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ సిబ్బంది పేర్కొంది. ఇక ఈ నెల 19న స్వామి వారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని వెల్లడించారు. అదేవిధంగా కల్యాణం అనంతరం మరుసటి రోజు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## పీర్జాదిగూడ.. పర్వతాపూర్ రోడ్డు పనులు పూర్తి చేయండి

- పీర్జాదిగూడ కార్పొరేషన్ లో కాంగ్రెస్ పార్టీ నాయకుల పర్యటన
- విద్యుత్, డ్రైనేజీ, మంచినీటి సమస్యలతో ప్రజల ఇక్కట్లు
- సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేసిన తుంగతుర్తి రవి, నాయకులు



జయభేరి, మేడిపల్లి :

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్ లలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి పర్యటించి ప్రజలకు అందుతున్న మౌలిక సదుపాయాలను,ఎదురవుతున్న సమస్యలను తుంగతుర్తి రవి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ.. రాబోయే వర్షా కాలం దృష్ట్యా ముందస్తు చర్యల కొరకు కార్పొరేషన్ ఏఈతో డ్రైనేజీలు, నూతన డ్రైనేజి ల నిర్మాణం, ఎలక్ట్రికల్ ఏఈతో కరెంట్ స్థంబాల రీప్లేస్ మెంట్, తదితర అంశాలతో పాటు పీర్జాదిగూడ పర్వతపూర్ కమాన్ రోడ్ విస్తరణ పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలను ట్రాఫిక్ సమస్య ల నుండి విముక్తులను చేయాలనీ, వర్షాకాలంలో కాలనీలలోకి వచ్చే వరద నీరు నిల్వకుండా డ్రైనేజీ లు, నాలాలను పునరుద్ధరించాలని, గతంలో జరిగిన వరద ముంపు ప్రాంతాలను దృష్టిలో పెట్టుకొని యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తిచేయాలని, ఈ వేసవికాలంలో ప్రజలకు మెరుగైన మంచినీటి సౌకర్యం కల్పించాలని, ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తుంగతుర్తి రవి విన్నపించారు. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు చంద్ర రెడ్డి, అంజిరెడ్డి, బోడిగె కృష్ణ గౌడ్, యాసరం మహేష్, అలవాల దేవేందర్ గౌడ్, కోఆప్షన్ మెంబర్ జగదీశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేందర్ రెడ్డి,బండి శ్రీను, చెరుకు మహేష్, పవన్ గౌడ్, మోహన్, సుదర్శన్ రెడ్డి, ఎన్ ఎన్ కే దుర్గ, రవీందర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, రవి యాదవ్, విక్రమ్ గౌడ్, శ్రీకాంత్ పటేల్, కర్రె రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వినతి

- పి ఆర్ సి చైర్మన్ ను కలిసిన మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్ రెడ్డి
- సానుకూలంగా స్పందించిన పి ఆర్ సి చైర్మన్ శివశంకర్

జయభేరి, మే 16:



రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరుతూ బీఆర్ భవన్ లోపి ఆర్ సి చైర్మన్ శివశంకర్ ను మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఉపాధ్యాయ సమస్యలపై పిఆర్టియు యూనియన్ తరపున వినతి పత్రం అందజేశారు. అనంతరం కాటేపల్లి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ పిఆర్సి లో అమలు చేయాల్సిన విషయాలపై పూర్తి నివేదికను అందజేశామని చెప్పారు. మాస్టర్ స్కేలు 34,200 292800 గా నిర్ణయించాలని, ఫిట్మెంట్ 45 శాతంగా నిర్ణయిస్తూ డిఏ 01/07/2023 33.67 శాతంగా ఫిట్మెంట్ చేయాలన్నారు. హెచ్ఆర్ఏ పరిధిని జిహెచ్ఎంసి నుంచి ప్రస్తుతం ఉన్న 8 కిలోమీటర్ల నుంచి 15 కిలో మీటర్లు వరకు పెంచాలన్నారు. 398 సమానవేతనంపై పనిచేసిన స్పెషల్ టీచర్ సర్వీస్ నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరుకు సిఫారసు చేయాలన్నారు. ఉద్యోగ విరమణ వయస్సు 61 సంవత్సరానికి పెంచినందున స్టాగ్నేషన్ ఆఫ్ ఇంక్రిమెంట్ 5 నుంచి 8 పెంచేలా ప్రభుత్వానికి సిఫార్సు చేయాలన్నారు. 50 సంవత్సరాల వయస్సు పూర్తైన వారికి అప్రయత్న పదోన్నతి స్కేలు పొందుటకు డిపార్ట్మెంటల్ పరీక్ష నుంచి మినాహాయింపు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు రాష్ట్ర అధ్యక్షులు చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్ బిక్షంగౌడ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి రామిడి వెంకట్రామ్ రెడ్డి మల్కాజ్ గిరి అధ్యక్షుడు శ్రీనివాస్ రావు, శామీర్ పేట్ అధ్యక్షుడు వెంకటేషం, తదితరులు పాల్గొన్నారు.



## లంచం తీసుకుంటూ ఏసీబీ వలలో చిక్కిన కరెంట్ ఆర్టిజన్ గ్రేడ్2

జయభేరి, చింతపల్లి :

చింతపల్లి మండలం మల్లారెడ్డి పల్లి గ్రామంలో విద్యుత్ శాఖ ఆర్టిజన్ గ్రేడ్2 విధులు నిర్వహిస్తున్న నడింపల్లి వేణు అనే వ్యక్తి రావి సూర్య నారాయణ రైతు వద్ద నుండి 20వేల రూపాయలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి మండలం మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రావి సూర్య నారాయణ గత మూడు సంవత్సరాలనుండి అగ్రికల్చర్, డోమెస్టిక్ విద్యత్ పోల్స్, బోరు కలెక్షన్ కోరకు ఇబ్బందులకు గురి చేసాడు... సదరు విద్యుత్ ఉద్యోగి యాభై వేలు డిమాండ్ చేసాడు. పనికి ముందుగా 20వేల రూపాయలు పని తరువాత 30వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేసాడు. దాంతో విసిగిపోయిన రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించి 20వేల రూపాయలు రైతు వద్ద నుండి తీసుకుంటుండగా ఏ సి బి, డిఎస్పి జగదీష్ రెడ్ హ్యాండెడ్ గా పట్టుకోని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపాడు.. వారి వెంట ఏసీబీ ఇన్స్పెక్టర్లు వెంకట్రావు, రామారావు సిబ్బంది వున్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న ను గెలిపించాలి

జయభేరి, దేవరకొండ :



దేవరకొండ పట్టణ కేంద్రంలోని పి పి ఆర్ కన్వెన్షన్ హాల్లో జరిగిన వరంగల్, ఖమ్మం,నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజక వర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నతో పాటు దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సభను ఉద్దేశించి మాట్లాడిన దేవరకొండ ఎమ్మెల్యే.. తీన్మార్ మల్లన్నకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలి.రాజ్యాంగాన్ని నాశనం చేయాలని బీజేపీ కుట్ర చేస్తుందని, రాజ్యాంగాన్ని నాశనం చేసి గిరిజనులు, దళితులు, వెనుకబడిన వర్గాలకు కల్పించిన రిజర్వేషన్లను రద్దు చేయాలని బీజేపీ కోరుకుంటుంది అని ఆరోపించారు.బీజేపీ గెలిస్తే ప్రభుత్వ రంగాన్ని మొత్తం ప్రైవేటీకరించడం ఖాయంమని ఎమ్మెల్సీ ఉప ఎన్నికల అత్యంత కీలకమైనవని అన్నారు.బీజేపీ ప్రభుత్వం వల్ల దళిత, గిరిజనులు, బలహీన వర్గాల హక్కులు, వారికి రావాల్సిన వాటా కూడా నష్టపోయే ప్రమాదం కనిపిస్తోందని అన్నారు. దళిత, గిరిజన, బహుజనులకు దేశంలో అషామాషీగా రిజర్వేషన్లు రాలేదని, బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని కాంగ్రెస్ నాయకులు అమలు చేయడం వల్లే రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయని అన్నారు.దళిత, గిరిజన, బహుజనల్లో మార్పు అంటూ వచ్చిందంటే అది కేవలం రిజర్వేషన్ల వల్లనే అని,విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయాల్లో అట్టడుగు వర్గాలకు అవకాశాలు దక్కింది అంటే రిజర్వేషన్ల వల్లనే అని అన్నారు .ఈ కార్యక్రమంలో వివిధ మండలాల పరిధిలో ఉన్న ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, పట్టభద్రులు తదితరులు పాల్గొన్నారు.



# ఫ్యాషన్ చిట్కాలు

రూ.100తో మీ లుక్ మొత్తం మార్చుకోవచ్చు.. ఇచ్చిపడేయొచ్చు

అందంగా కనిపించేందుకు వేలు, లక్షలు ఖర్చు చేయాల్సిన పని లేదు. అతి తక్కువ ధరలోనూ మీరు అందంగా కనిపిస్తారు. వందల రూపాయలతోనే మీరు స్టైలిష్ లుక్ పొందవచ్చు.

స్టైలిష్‌గా కనిపించడం ఎల్లప్పుడూ ముఖ్యం. అయితే దీనికోసం డబ్బులు ఎక్కువగా ఖర్చు చేయాల్సిన పని లేదు. ఐటమ్‌కు వంద రూపాయలు పెట్టినా సరిపోతుంది. మీరు చాలా అందంగా కనిపిస్తారు. మీ లుక్ చూసి అందరూ ఫిదా అవుతారు. ఏదైనా అర్జంట్ ఫంక్షన్ వెళ్లాల్సి ఉంటే ఈ ట్రిక్స్ పాటించండి. మీ జేబును ఆదా చేయడంలో ఫ్యాషన్ చిట్కాల గురించి తెలుసుకోండి.

మార్కెట్‌లో ప్రసిద్ధి చెందిన బ్రాండ్ దుస్తులు అయినా, లేదా ఖరీదైన బ్రాండ్ సౌందర్య సాధనాలు, ఆభరణాలు అయినా ఇవి మాత్రమే మీ ఫ్యాషన్‌కు ఎల్లప్పుడూ స్టైలిష్ రూపాన్ని ఇస్తాయనుకోకూడదు. ఆశ్చర్యంగా అనిపించినా ఇది నిజం. ఆఫీసు, ఈవినింగ్ పార్టీ కోసం సిద్ధమవుతున్నా లేదా స్నేహితులతో టూర్ ప్లాన్ చేసుకున్నా.. స్టైలిష్‌గా కనిపించడం ఎల్లప్పుడూ ముఖ్యం. మీకు తక్కువ ఖర్చుతో అందంగా రెడీ అయ్యేందుకు కొన్ని చిట్కాలు తెలుసుకోండి.

**స్టైలిష్ జ్యువెలరీ :** చెవిపోగులు, చైన్లు, బ్రాస్లెట్లు లేదా ఉంగరాలు వంటి స్టైలిష్ ఆభరణాలను రూ.100కి కొనుగోలు చేయవచ్చు. ఇది మీ రూపానికి కొంత గ్లామర్, శైలిని జోడిస్తుంది. ఇవి మార్కెట్లో చాలా దొరుకుతాయి.

**రంగురంగుల స్కార్ఫ్ :** మీరు రూ.100కి రంగురంగుల స్కార్ఫ్ కొనుగోలు చేయవచ్చు. ఇది మీ రూపాన్ని మరింత స్టైలిష్‌గా మారుస్తుంది. మీరు దానిని మీ మెడ చుట్టూ స్టైల్ చేసి కట్టుకోవచ్చు. ఇది అందరిలో మిమ్మల్ని ప్రత్యేకంగా చూపిస్తుంది.

**మేకప్ :** మీరు మేకప్ వేసుకుంటే అది మీ రూపాన్ని ప్రకాశవంతం చేస్తుంది. సింపుల్ లుక్ కోసం మీరు కాజల్, లిప్‌స్టిక్‌ని ఉపయోగించవచ్చు. మీరు మరింత స్టైలిష్ లుక్ కావాలనుకుంటే మీరు ఐషాడో, బ్లష్‌ని కూడా ఉపయోగించవచ్చు. ఇవి మార్కెట్లో చాలా తక్కువ ధరకు దొరుకుతున్నాయి.

**కేశాలంకరణ :** మీరు మీ జుట్టును స్టైలిష్‌గా కట్టుకోవడం ద్వారా మీ రూపాన్ని మెరుగుపరచుకోవచ్చు. మీరు పోనీటైల్ తయారు చేయవచ్చు. మీరు మీ జుట్టును రంగుల హెయిర్ బ్యాండ్‌లు, హెయిర్ క్లిప్‌లతో అలంకరించవచ్చు.

**బట్టలు సరైన ఎంపిక :** అతి తక్కువ ధరతో చౌక బజార్లు, పాతకాలపు దుకాణాల నుండి స్టైలిష్ దుస్తులను కొనుగోలు చేయవచ్చు. మీ శరీరాకృతిని బట్టి దుస్తులను ఎంచుకోవాలి. మీరు వివిధ నియమాలతో ప్రయోగాలు చేయవచ్చు.

**సన్ గ్లాసెస్ :** మీరు స్టైలిష్ సన్ గ్లాసెస్ రూ.100కు పొందవచ్చు. ఇది మీ రూపానికి కొత్త లుక్ తీసుకువస్తుంది.

**క్యాప్ :** మీరు స్టైలిష్ క్యాప్‌ని అతి తక్కువ ధరలో కొనుక్కోవచ్చు. ఇది మీ రూపానికి కొంత వ్యక్తిత్వం, శైలిని జోడిస్తుంది.


**బెల్ట్ :** మీరు స్టైలిష్ బెల్ట్‌ను కూడా కొనుక్కోవచ్చు. ఇది అధునాతనతను, మంచి లుక్‌ను ఇస్తుంది.

**గడియారాలు :** మీరు స్టైలిష్ వాచ్‌ను రూ.100కు కొనుక్కోవచ్చు. ఇది అందరిలో మీరు ప్రత్యేకంగా ఉండేలా చేస్తుంది.

**షూస్ :** రూ. 100, 200 పెడితే చౌక మార్కెట్లు లేదా ఇతర షాపుల నుండి స్టైలిష్ షూలను కొనుగోలు చేయవచ్చు. మీకు సౌకర్యవంతంగా, మీ రూపానికి సరిపోయే షూలను మీరు ఎంచుకోవాలి.

అయితే పైన చెప్పిన వస్తువులు తక్కువకు ఎక్కడ దొరుకుతాయని మీకు డౌట్ రావొచ్చు. హైదరాబాద్‌లో ఉండే చాలా మందికి అవి దొరికే ప్రదేశాలు తెలుసు. చార్మినార్, కోటి, దిల్‌షుఖ్‌నగర్ మెట్రో పక్కన, కేబీహెచ్‌బీ మెట్రో పక్కన ఇలాంటి షాప్స్ చాలానే ఉంటాయి. మీరు అక్కడ ఒక్క రౌండ్ తిరిగితే చాలు మీకు కావాల్సిన స్టైలిష్ లుక్ తెచ్చేవి చాలానే దొరుకుతాయి.





ఐపీఎల్ పదిహేడో సీజన్‌లో రికార్డులు బద్దలు కొట్టిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ప్లే ఆఫ్స్‌లో అడుగుపెట్టింది. సొంతగడ్డపై గుజరాత్ టైటాన్స్ తో జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కావడంతో కమిన్స్ సేన మూడో స్థానంతో ప్లే ఆఫ్స్ బెర్తు ఖాయం చేసుకుంది. వాన ఎంతకు తగ్గకపోవడంతో అంపైర్లు ఇరుజట్లకు ఒక్కో పాయింట్ కేటాయించారు. దాంతో, 15 పాయింట్లతో కమిన్స్ సేన టైటిల్ పోరులో నిలిచింది.

# ప్లే ఆఫ్స్‌లో 'సన్‌రైజర్స్'

సొంతగడ్డపై సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్ల విధ్వంసాన్ని కళ్లారా చూడాలనుకున్న ఫ్యాన్స్‌కు నిరాశే మిగిలింది. గురువారం మధ్యాహ్నం 3:45 గంటల నుంచి ఎడతెరిపి లేకుండా కురిసన వాన వేలాది మంది ఉత్సాహంపై నీళ్లు చల్లింది. కనీసం ఐదు ఓవర్ల మ్యాచ్ అయినా చూద్దామనుకుని ఎంతో ఓపికగా ఎదురుచూశారు.

కానీ, 10:11 గంటలకు మ్యాచ్ రద్దు చేస్తున్నట్టు అంపైర్లు ప్రకటించారు. ఇరుజట్ల కెప్టెన్లు, కోచ్‌లను పిలిచి మ్యాచ్ నిర్వహణ సాధ్యం కాదని తేల్చి చెప్పి ఒక్కో టీమ్‌కు ఒక్కో పాయింట్ ఇచ్చారు. దాంతో, ఆరెంజ్ ఆర్మీ 15 పాయింట్లతో నేరుగా ప్లే ఆఫ్స్‌కు దూసుకెళ్లింది. ఒక్క బంతి కాదు కదా.. కనీసం టాస్ పడకుండానే మ్యాచ్ రద్దు కావడంతో అభిమానులు ఉసూరుమంటూ ఇంటిదారి పట్టారు.

**5 ఓవర్ల ఆట సాధ్యపడలే..**

ఉప్పల్ స్టేడియంలో 6:45కి వర్షం కాస్త తెరిపి ఇవ్వడంతో 8:00 గంటలకు టాస్ వేద్దామనుకున్నారు. తీరా ఆ సమయానికి మళ్లీ నేనొదలా అంటూ వరుణుడు స్టేడియాన్ని చుట్టుముట్టాడు. దాంతో, సిబ్బంది పరుగున వచ్చి పిచ్‌ను ప్లాస్టిక్ కవర్లతో కప్పేశారు. 8:30 గంటలకు మ్యాచ్ షురూ కాకపోవడంతో ఓవర్ల కోత మొదలైంది. ఒకవేళ 10:30కి గనుక మ్యాచ్ మొదలైతే కనీసం 5 ఓవర్ల ఆట ఆడిస్తారని ఫ్యాన్స్ ఊహించారు. అయితే.. దానిపై మ్యాచ్ రిఫరీగానీ, నిర్వాహకులుగానీ అధికారిక ప్రకటన చేయలేదు. దాంతో, మ్యాచ్ రద్దుకే మొగ్గు చూపుతారనే వార్తలు వినిపించాయి. అనుకున్నట్టుగానే అంపైర్లు గ్రౌండ్ క్యూరేటర్, అధికారులతో మాట్లాడి మ్యాచ్‌ను రద్దు చేశారు.

**లక్నోను చిత్తు చేసి..**

కమిన్స్ నేతృత్వంలోని హైదరాబాద్ ఈ సీజన్‌లో అదరగొట్టింది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మలు అదిరే ఆరంభాలు ఇవ్వగా మిడిలార్డర్‌లో హెన్రిచ్ క్లాసెన్, మర్‌క్‌రమ్, తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డిలు దంచికొట్టారు. ఆల్‌రౌండర్ షహ్‌బాజ్ అహ్మద్ సైతం మెరుపు బ్యాటింగ్‌తో అలరించగా.. బౌలర్లు భువనేశ్వర్, నటరాజన్, ఉనాద్కాట్‌లు ప్రత్యర్థుల భరతం పట్టారు. గత మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌ను చిత్తుగా ఓడించిన సన్‌రైజర్స్ ప్లే ఆఫ్స్ ఆశల్ని సజీవంగా ఉంచుకుంది. గుజరాత్‌పై భారీ విజయంతో 16 పాయింట్లు సాధించాలనుకున్న హైదరాబాద్‌కు వరుణుడు అడ్డుపడ్డాడు.

**ఏపీపీఎల్‌లో నితీశ్‌కు అత్యధిక ధర**

ఐపీఎల్ 17లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) తరఫున ఆడుతూ ఆల్‌రౌండ్ షోతో అదరగొడుతున్న వైజాగ్ కుర్రాడు నితీశ్‌కుమార్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ప్రీమియర్ లీగ్ (ఏపీపీఎల్) వేలంలో అత్యధిక ధర దక్కించుకున్న ఆటగాడిగా నిలిచాడు.

వేలంలో నితీశ్‌ను 'మర్లిన్ గోదావరి టైటాన్స్' ఫ్రాంచైజీ రూ.15.6 లక్షలకు కొనుగోలు చేసింది. ఐపీఎల్ వేలంలో ఎస్ఆర్‌హెచ్ రూ. 20 లక్షల ధరతో నితీశ్‌ను తీసుకున్న విషయం విదితమే.



# పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోండి


అది మీలో తెలివిని, ధైర్యాన్ని నింపుతుంది

పుస్తకాలు చదివే అలవాటు ఆధునిక కాలంలో తగ్గిపోతోంది. కానీ పుస్తక పఠనం మనకు తెలియకుండానే మనలో ఎంతో మేధస్సును నింపుతుంది. పుస్తకాలు చదివే వారి సంఖ్య చాలా తక్కువ. ఖాళీ దొరికితే ఫోన్లతో బిజీ అయిపోయిన వారే కనిపిస్తారు. నిజానికి ప్రతిరోజూ కొంత సమయం పుస్తక పఠనానికి కేటాయించాలి. మీరు ఎంతగా పుస్తకాలు చదివితే అంతగా మీకు తెలియకుండానే మీ మేధస్సు కూడా పెరుగుతుంది. పుస్తక పఠనం మిమ్మల్ని, మీ ఆలోచనలను, మీ జీవితాన్ని ఎంతో ప్రభావితం చేస్తుంది. ఒంటరిగా ఉన్నప్పుడు ఒక అరగంట పాటు ఏదైనా మంచి పుస్తకాన్ని చదవండి. మీకే చక్కటి అనుభూతి కలుగుతుంది. ప్రశాంతంగా అనిపిస్తుంది. పుస్తక పఠనం మనలో మరెన్నో సానుకూల ప్రభావాలకు కారణం అవుతుంది.

**ఒత్తిడి తగ్గిస్తుంది**

ప్రతిరోజూ కాసేపు పుస్తకం చదవడం వల్ల జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయి. ఒత్తిడి స్థాయిలు కూడా తగ్గుతాయి. మీలో సృజనాత్మకత పెరుగుతుంది. మాట్లాడేటప్పుడు మెరుగైన పదాలను వాడడం, పుస్తకం పఠనం నేర్పిస్తుంది. మీరు మాట్లాడే తీరు మీ ఎదుటివారిని ఆకట్టుకునేలా చేస్తుంది. ఇది కూడా మీరు జీవితంలో ఎదగడానికి ఎంతో ఉపయోగకరమైన సాధనం... పుస్తక పఠనం. మీరు రకరకాల పుస్తకాలు చదువుతున్నప్పుడు ఆ పదజాలం మీ మెదడులో నిండిపోతుంది. మిమ్మల్ని మీరు మరింతగా వ్యక్తికరించుకోవడానికి ఆ పదాలు ఎంతగానో ఉపయోగపడతాయి. మీ మాట్లాడే సామర్థ్యం మిమ్మల్ని మరింత మందికి నచ్చేలా చేస్తుంది. కమ్యూనికేషన్ నైపుణ్యాలు ప్రతి జీవితంలో అడుగడుగునా అవసరమే. పుస్తక పఠనం అనేది ఒక విషయాన్ని అర్థం చేసుకునే నైపుణ్యాన్ని పెంచుతుంది. గ్రహణ నైపుణ్యం అభివృద్ధి చేయడానికి పుస్తకాలు చదవడం చాలా ముఖ్యం. ఆధునిక కాలంలో ఒత్తిడి బారిన పడుతున్న వారి సంఖ్య అధికంగానే ఉంది. ఒత్తిడి నుంచి ఉపశమనం పొందాలి. అంటే ప్రశాంతమైన పుస్తకాలను చదువుతూ ఉండాలి. పుస్తక పఠనం మీలో మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది. ఆందోళన స్థాయిలను తగ్గిస్తుంది. మీలో జ్ఞానాన్ని పెంచుతుంది. ఒత్తిడితో కూడిన పరిస్థితులను ఎదుర్కోవడానికి ధైర్యాన్ని, తెలివితేటలను ఇస్తుంది.

వయసు పెరుగుతున్న కొద్దీ జ్ఞాపకశక్తి తగ్గుతుంది. అభిజ్ఞా క్షీణత కూడా ఉంటుంది. ఎవరైతే పుస్తకాలు అధికంగా చదువుతారో వారికి వయసు పెరిగినా కూడా అభిజ్ఞా సామర్థ్యం కూడా పెరిగే అవకాశం ఉంది. పుస్తక పఠనం మీ మనసును, మెదడను చురుగ్గా చేస్తుంది. వయసుతో పాటు వచ్చే మతిమరుపు, అభిజ్ఞా క్షీణత వంటి సమస్యలను దూరం చేస్తుంది. పుస్తక పఠనం మిమ్మల్ని సంతోషకరమైన వ్యక్తిగా మారుస్తుంది. ఏదైనా మంచి పుస్తకాన్ని ఎంచుకొని పుస్తక పఠనాన్ని మొదలుపెట్టండి. మీలో వచ్చే మార్పులను మీరే గమనించండి. నెలరోజుల పాటు క్రమం తప్పకుండా ప్రతిరోజూ కనీసం ఒక గంట సేపు ఏదైనా మంచి పుస్తకాన్ని చదవడానికి కేటాయించి... నెల రోజులు తర్వాత మీలో ఎలాంటి మార్పులు వచ్చాయో మీరే ఒక అంచనా వేసుకోండి.





# స్పీడందుకున్న గేమ్‌చేంజర్

మెగా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న పొలిటికల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'గేమ్‌చేంజర్'. దాదాపు రెండున్నరేళ్లుగా ఈ సినిమా షూటింగ్ జరుగుతూనేవుంది. శంకర్ 'భారతీయుడు' ఫ్రాంచైజీతో బిజీ కావడమే ఈ జాప్యానికి కారణం. అయితే, ఎట్టకేలకు ఈ సినిమా నిర్మాణంలో వేగం పెంచారు దర్శకుడు శంకర్. సునీల్ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఆయన నేపథ్యంలోసాగే సన్నివేశాలను చిత్రీకరించారు. తదుపరి షెడ్యూల్ ఈ నెలాఖరు నుంచి షురూ చేశారు. రామ్‌చరణ్ లేని సన్నివేశాలను ఈ షెడ్యూల్‌లో పూర్తి చేస్తారని సమాచారం. దీనికోసం సెకండ్ యూనిట్‌ను నియమించాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ చిత్రంలో కియారా అద్వానీ, అంజలి కథానాయికలు. శ్రీకాంత్, ఎస్.జె.సూర్య, నరేశ్, సముద్రఖని, నాజర్, ప్రియదర్శి ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి సంగీతం: తమన్, నిర్మాత: దిల్‌రాజు.

# ప్రభాస్ సలార్ 2లో దసరా విలన్.. క్రేజీ టాక్ నిజమేనా..?



ప్రభాస్ కాంపౌండ్ నుంచి వరుస సినిమాలు లైన్‌లో ఉన్నాయని తెలిసిందే. ఈ గ్లోబల్ స్టార్ హీరో టైటిల్ రోల్‌లో వస్తోన్న యాక్షన్ థ్రిల్లర్ సలార్. ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో రెండు పార్టులుగా వస్తోండగా.. సలార్ పార్టు 1 గతేడాది గ్రాండ్‌గా విడుదలై బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు రాబట్టింది. ఈ ఫ్రాంఛైజీలో మాలీవుడ్ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ వన్ ఆఫ్ ది లీడ్ రోల్‌లో నటిస్తున్నాడని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. తాజాగా ఈ క్రేజీ ప్రాజెక్టులో మరో మలయాళ స్టార్ యాక్టర్ భాగం కాబోతున్నాడన్న వార్త ఒకటి మూవీ లవర్స్‌లో జోష్ నింపుతోంది. ఇంతకీ ఆ నటుడెవరనుకుంటున్నారా..? నాని హీరోగా నటించిన దసరా సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరవడమే కాదు.. ఒక్క సినిమాతో ఇక్కడ సూపర్ పాపులారిటీ సంపాదించుకున్న షైన్ టామ్ చాకో. ఈ క్రేజీ యాక్టర్ ఇప్పుడు సలార్ 2లో ప్రభాస్‌తో స్క్రీన్ షేర్ చేసుకోబోతున్నాడన్న వార్త ఒకటి నెట్టింట హల్ చల్ చేస్తోంది. మరి ఇదే నిజమైతే షైన్ టామ్ చాకో క్రేజ్ గ్లోబల్ వైడ్‌గా మార్మోగిపోవడం ఖాయమైనట్టే. దీనిపై మేకర్స్ నుంచి ఏదైనా అధికారిక ప్రకటన వస్తుందేమో చూడాలి మరి. సలార్ 2ను సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు ప్రశాంత్ నీల్ టీం రెడీ అయిందని, షూటింగ్ మే చివరలో షురూ కానుందని ఇప్పటికే ఓ వార్త నెట్టింట హల్ చల్ చేస్తోంది. తాజా టాక్ ప్రకారం సలార్ 2 షూటింగ్ రామోజీఫిలిం సిటీలో షురూ కానుంది. మొదటి షెడ్యూల్ 10 రోజులపాటు కొనసాగనుండగా.. ప్రభాస్, పృథ్వీరాజ్ సుకుమారన్‌పై వచ్చే సన్నివేశాలను చిత్రీకరించనున్నారట. సలార్ 2 షూట్ పూర్తి చేసి 2025 డిసెంబర్‌లో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేలా సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. హోంబలే ఫిలిమ్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న సలార్ 2లో శృతిహాసన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. శ్రియా రెడ్డి, టిన్ను ఆనంద్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.





# అలాంటి అబ్బాయి కావాలి..

కథానాయికల ప్రేమ, పెళ్లి విషయాల గురించి అభిమానులకు చాలా ఆసక్తి ఉంటుంది. ముఖ్యంగా సదరు నాయిక ప్రేమలో ఉందంటే చాలు శుభవార్త ఎప్పుడు చెబుతుందోనని ఎదురుచూస్తుంటారు. ఇప్పుడు జాన్వీకపూర్ అలాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నది. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి సుశీల్‌కుమార్ షిండే మనవడు శిఖర్ పహారియాతో ఈ భామ ప్రేమలో ఉందని ప్రచారం జరుగుతున్నది. ఇటీవలే ఓ సినిమా ప్రీమియర్ షోకు హాజరైన జాన్వీకపూర్ 'శిఖు' అనే లోగో వున్న నెక్లెస్‌ను ధరించారు. దీంతో ఈ ఇద్దరి మధ్య బంధం నిజమేనని అభిమానులు అనుకుంటున్నారు. ఈ నేపథ్యంలో తన తాజా చిత్రం 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' ప్రమోషన్‌కు హాజరైన జాన్వీకపూర్ తనకు కాబోయే భర్త ఎలా ఉండాలో చెప్పుకొచ్చింది. 'ఎలాంటి క్లిష్టపరిస్థితుల్లోనైనా నాకు ధైర్యం చెప్పాలి. నా కలల సాకారానికి అండగా నిలవాలి. ఎప్పుడూ నన్ను సంతోషంగా ఉంచాలి. అలాంటి వ్యక్తినే నేను పెళ్లాడతా' అని చెప్పుకొచ్చింది. శిఖర్ పహారియాతో రిలేషన్‌షిప్ గురించి అడగ్గా సమాధానాన్ని దాటవేసింది. క్రికెట్ నేపథ్య కథాంశంతో 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ నెల 31న విడుదల కానుంది.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com